
సాక్షి పల్నాడు

శుక్రవారం । 31 । జనవరి । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 552.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,700 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వాల్‌పోస్టర్స్ ఆవిష్కరణ

బాపట్ల : స్పర్శ కుష్ఠు నివారణ పక్షోత్సవాల సందర్భంగా గురువారం వాల్‌పోస్టర్స్‌ను కలెక్టర్ జె.వెంకట మురళి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 13 వరకు సర్వే కొనసాగుతుందని తెలిపారు.

విగ్రహాలకు ముసుగులు



నరసరావుపేటఈస్ట్: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో పట్టణంలోని రాజకీయపార్టీల నాయకుల విగ్రహాలకు మున్సిపల్ సిబ్బంది ముసుగులు తొడుగుతున్నారు.

న్యూస్‌రీల్

వాసవీ అమ్మవారికి 15 కిలోల వెండి వస్తువులు బహూకరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలోని అమ్మవారికి సుమారు 15 కిలోల వెండి వస్తువులను పట్టణానికి చెందిన పెరుమాళ్ల రాజేష్, వనజా లక్ష్మి దంపతులు గురువారం బహూరించారు. అందులో శ్రీ చక్రం ప్లేటు, కూర్మం, సప్త హారతులు, ఏకహారతి, గంటలను వెండితో తయారు చేయించి అందించారు. వీటి విలువ సుమారు రూ.12.5 లక్షలు ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం



అచ్చంపేట: మండల పరిధిలోని మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన రూ.62 లక్షల నాబార్డు నిధులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంజూరు చేయించిన విషయం తెలిసిందే. 2023 జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి క్రోసూరులో వర్చువల్‌గా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. మళ్లీ ఇన్ని రోజులకు బ్రిడ్జి నిర్మాణ పనులను కొనసాగించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల మధ్య రాకపోకలను సుగమం చేయాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సులో చోరీ


ప్రయాణికురాలి పర్సు కత్తిరించి రూ.2 లక్షల అపహరణ

నరసరావుపేటటౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి పర్సు కత్తిరించి రూ.2 లక్షల నగదు అపహరించిన ఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్లకు చెందిన కొడవలి సుజాత గుంటూరు వెళ్లేందుకు స్వగ్రామం నుంచి నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు దిగి మరో బస్సు ఎక్కి చూసుకోగా పర్సులో ఉండాల్సిన నగదు కనిపించలేదు. పర్సు కింది భాగం కత్తిరించబడి ఉంది. సమాచారం అందుకున్న సీఐ విజయ్‌చరణ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యార్డులో 1,09,020 మిర్చి బస్తాలు విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,02,729 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,09,020 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,500 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 68,402 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 118, బ్యాంక్ కెనాల్‌కు 138, తూర్పు కెనాల్‌కు 244, పశ్చిమ కెనాల్‌కు 122, నిజాంపట్నం కాలువకు 51, కొమ్మమూరు కాలువకు 945 క్యూసెక్కులు విడుదల చేశారు.



కాలం కలిసి రాకో.. పరిస్థితులు అనుకూలించకో.. అప్పులు తలపై నిప్పుల కుంపట్లుగా రగులుతుంటే ఐపీ పెట్టడం సాధారణం. ముందస్తుగా పక్కా ప్లాన్ ప్రకారం ప్రజల కళ్లకు ఆశల గంతలు కట్టి.. గల్లాపెట్టి మొత్తం ఊడ్చేసి, తట్టాబుట్టా సర్దుకుని ఐపీ పేరిట నమ్ముకున్న వాళ్ల నెత్తిన టోపీ పెట్టడం నరసరావుపేటలో నయా ట్రెండ్. తాజాగా నరసరావుపేటలో ఐపీల పేరుతో ఉడాయించిన వారి లీలలు ఒక్కొక్కటి బయటపడుతుంటే.. వారిని నమ్మి పెట్టుబడులు పెట్టినవాళ్లు నోరెళ్లపెడుతున్నారు. ప్రజలకు కుచ్చుటోపి పెట్టిన ఓ బ్లఫ్ మాస్టర్ కథేంటో ఓసారి చూద్దాం.

బ్లఫ్ మాస్టర్..!

- రిజిస్ట్రేషన్ చిట్స్ పేరుతో ఘరానా మోసం
- అనధికార చీటిపాటల నిర్వహణ
- నకిలీ పీఎస్‌ఓ రశీదులతో కస్టమర్లకు కుచ్చుటోపి
- రూ.400 కోట్ల వరకు పోగేసుకొని ఉడాయింపు
- ప్రజల సొమ్ముతో విలాసవంతమైన జీవితం
- నరసరావుపేటలో గగ్గోలు పెడుతున్న బాధితులు



సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట టౌన్: రూ.400 కోట్లతో ఉడాయించిన చిట్‌ఫండ్ వ్యాపారి ఉదంతం రోజురోజుకు మలుపుతిరుగుతోంది. మొదట రూ.150 కోట్లతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని భావించారు. తరువాత బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తుండటంతో ఆ మొత్తం సుమారు రూ.400 కోట్లకు చేరింది. ప్రైవేట్ చిట్స్, రియల్‌ఎస్టేట్ పేరుతో నమ్మకంగా వ్యాపారం చేస్తూ ఎంతోమంది వద్ద రూ.కోట్లు అప్పుగా తీసుకున్నాడు. ప్రజల సొమ్ముతో విలాసవంత జీవితాన్ని గడుపుతూ చివరకు రాత్రికిరాత్రే కుటుంబంతో సహా పరారయ్యాడు. స్థానికులతో పాటు అనేక ప్రాంతాల వారు అతని వద్ద చీట్టీల సభ్యులుగా చేరారు. గత 25 ఏళ్ల నుంచి పల్నాడు రోడ్డులో బహుళ అంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకొని చిట్‌ఫండ్ నిర్వహిస్తూ జనాల్ని ఆకట్టుకున్నాడు. అధిక వడ్డీలకు డబ్బు తీసుకొని సకాలంలో చెల్లించాడు. దీంతో ప్రజలు అతని ఆశల వలలో పడి దారుణ మోసానికి గురయ్యారు. రిజిస్ట్రేషన్ సంస్థలో చిట్ వేశాం తమ డబ్బులకు ఢోకా లేదనుకున్న సభ్యులు రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి విచారణ చేయగా విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. దీంతో బాధితులంతా గుండెలు బాదుకుంటున్నారు.

బురిడీకి ఐదేళ్ల ముందే బీజం..

పరారైన చిట్‌ఫండ్ వ్యాపారి సంస్థకు సంబంధించి 2020 తరువాత కొత్త చిట్‌లకు సంబంధించి ఎటువంటి అధికారిక రిజిస్ట్రేషన్ లేదు. నిబంధనల ప్రకారం ఓ చీటి పాట మొదలయ్యే సమయంలో సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చీటి పాట విలువ కలిగిన మొత్తం డిపాజిట్ చేసి ప్రీవియస్ శాంక్షన్ ఆర్డర్(పీఎస్‌ఓ) నంబర్ పొందాల్సి ఉంటుంది. అయితే అజ్ఞాతంలోకి వెళ్లిన చిట్‌ఫండ్ సంస్థ గత నాలుగేళ్లుగా కొత్త చీటిపాట కోసం ఎటువంటి అనుమతులు పొందలేదని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ వ్యవహారం చూస్తుంటే డబ్బులతో ఉడాయించేందుకు ముందుగానే వ్యూహం పన్నినట్టుగా స్పష్టమవుతోంది. అయితే ఈ నాలుగేళ్ల వ్యవధిలో అనధికారికంగా రూ.80 లక్షల చిట్‌లు మూడు, రూ.50 లక్షల చిట్స్ నాలుగు, రూ.30 లక్షల చిట్స్ మరో నాలుగుతోపాటు మరిన్ని నిర్వహించి సభ్యుల చేత భారీ స్థాయిలో డబ్బులు కట్టించుకున్నట్టు సమాచారం. చిట్‌ఫండ్ సంస్థ ఇచ్చిన రశీదులతో బాధితులు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి విచారించగా అవి అనధికారికమైనవని తేల్చారు. జిల్లాలో నమోదైన 23 చిట్‌ఫండ్ సంస్థలకు సంబంధించి 2019 ఏడాదికిగాను నరసరావుపేట రిజిస్ట్రార్ కార్యాలయంలో 70 చీటిపాటలకు మాత్రమే పీఎస్‌ఓ నంబర్లు కేటాయించినట్టు రికార్డులు చెబుతున్నాయి.. ప్రస్తుతం పరారైన చిట్‌ఫండ్ కంపెనీకి సంబంధించిన ఓ బాధితుడు తెచ్చిన రశీదుపై పీఎస్‌ఓ నంబర్ 104 ఉండటంతో అధికారులు అవాక్కయ్యారు. తాము ఆ ఏడాదిలో కేవలం 70 చిట్స్‌కే అనుమతులిస్తే 104 నంబర్‌తో రశీదు ఎలా విడుదల చేశారంటూ ఆశ్చర్యానికి లోనయ్యారు. నకిలీ పీఎస్‌ఓ నంబర్‌తో ప్రజలను మోసం చేసినట్టు రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు భావిస్తున్నారు. అయితే ఇప్పటివరకు బాధితులు ఫిర్యాదు చేయడానికి ముందుకు రాకపోవడంతో తామేమీ చేయలేమంటున్నారు.

ప్రజల సొమ్ముతో సోకు..

చీటిపాటలు, వడ్డీల రూపంలో ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బుతో చిట్‌ఫండ్ వ్యాపారి విలాసవంత జీవితాన్ని గడిపాడని బాధితులు ఆరోపిస్తున్నారు. రామిరెడ్డిపేటలో సుమారు 15 సెంట్ల స్థలంలో రూ.20 కోట్లతో అత్యాధునిక హంగులతో భారీ ఇంటి నిర్మాణం చేపట్టినట్టు తెలుస్తోంది. తన కుమారుడి నిశ్చితార్థం సందర్భంగా కాబోయే కోడలికి రూ.5 కోట్లతో వజ్రాభరణాలు, రూ.3 కోట్లతో బంగారు నగలు గిఫ్టుగా ఇచ్చినట్టు చెబుతున్నారు. నిర్మించబోయే ఇంటిని చూపించి బ్యాంక్ లోన్ రాగానే డబ్బులు తిరిగి ఇస్తానని నమ్మించి పలువురి వద్ద పెద్దమొత్తంలో వడ్డీకి డబ్బులు తీసుకున్నాడట. బాధితుల్లో పట్టణ వ్యాపార ప్రముఖులు ఉన్నారు. అయితే లెక్కలు చూపని డబ్బు కోట్ల రూపాయలు ఉండటంతో ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

రేపటి నుంచి కందులు కొనుగోలు

పల్నాడు, గుంటూరు జిల్లాల మార్క్‌ఫెడ్ డీఎం ఆర్‌జే కృష్ణారావు

కొరిటెపాడు(గుంటూరు): పల్నాడు జిల్లాలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కందులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని గుంటూరు, పల్నాడు జిల్లాల మార్క్‌ఫెడ్ మేనేజర్ ఆర్‌జే కృష్ణారావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రైతులు పండించిన కంది పంటను కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,550లకు నాఫెడ్ తరపున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ముందుగా కందులు పండించిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సీఎం యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పల్నాడు జిల్లాలో 28 మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 202 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందని వెల్లడించారు. కోసిన కంది పంటను నూర్పిడి చేసి బాగా ఆరబెట్టి శుభ్రం చేసుకోవాలని, శుభ్రం చేసిన కందులలో తేమ శాతం 12 శాతం లోపు ఉండేట్లు ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులు తమ కందులను తమ సొంత గోనె సంచులలోనే తమకు కేటాయించిన కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులు తమ కంది పంట ఈ–క్రాప్ బుకింగ్‌లో నమోదు అయినదో లేదో సంబంధింత రైతు సేవా కేంద్రంలో చూసుకోవాలన్నారు. ఈ–క్రాప్‌లో నమోదు కానటువంటి రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేయబడదని స్పష్టం చేశారు. ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంక్ అకౌంట్ నంబరు, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌తో పాటు రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంక్ ఖాతాలో మాత్రమే డబ్బులు జమ చేయనున్నట్టు ఆయన వివరించారు.

బాదుడే బాదుడు

అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కూడా గడవకముందే చంద్రబాబు నాయుడు ముసుగు తొలగిపోతోంది. ఎన్నికల్లో అలవిగాని హామీలతో ప్రజలను మభ్యపెట్టిన బాబు.. అందలమెక్కిన వెంటనే నిజం స్వరూపం ఒక్కొక్కటిగా బయట పెడుతున్నారు. ఎన్నికలకు ముందు బాదుడే బాదుడు అంటూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసిన బాబు.. కొద్ది రోజుల క్రితం ట్రూఅప్ చార్జీలతో విద్యుత్ వినియోగదారులకు షాక్ ఇచ్చారు. తాజాగా భూ రిజిస్ట్రేషన్ల పేరిట మరో వడ్డనకు రంగం సిద్ధం చేశారు. తొలుత నూతన సంవత్సర కానుకగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు సిద్ధమైన సర్కారు కాస్త వాయిదా వేసి ఫిబ్రవరి నుంచి అమలుకు చర్యలు చేపట్టనుంది.

- రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు
- పట్టణ ప్రాంతాల్లో 15 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 40 శాతం
- ఫిబ్రవరి నుంచి అమలుకు శ్రీకారం
- తీవ్ర వ్యతిరేకత రావడంతో జనవరి నుంచి పెంచాలనుకొని ఫిబ్రవరికి వాయిదా
- మధ్య తరగతి ప్రజలపై తీవ్ర భారం మోపనున్న కూటమి సర్కారు



నరసరావుపేటటౌన్: గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల పెంపు విషయంలో ఆచితూచి వ్యవహరించింది. పట్టణాలతోపాటు మునిసిపాలిటీలలో విలీన గ్రామాలకు కేవలం 10 శాతమే పెంచింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఐదేళ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలపై చార్జీల పిడుగులు కురిపిస్తోంది. ఇప్పటి వరకు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేని ప్రభుత్వం.. చార్జీల వడ్డన మాత్రం షురూ చేసింది. పట్టణ, సమీప గ్రామాల్లో ఎక్కువగా క్రయ, విక్రయాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి రిజిస్ట్రేషన్ల చార్జీలు 15 శాతం పెంచనుంది.

గ్రామీణ ప్రాంతాల్లో భారీగా పెంపు..

గ్రామీణ ప్రాంతాల్లో 40 శాతం పెంపునకు కూటమి సర్కారు సిద్ధమైంది. ఇది పేద, మధ్య తరగతి ప్రజలకు పెనుభారంగా మారనుంది. 2019 తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచలేదు. పల్నాడు జిల్లాలో రొంపిచర్ల, సంతమాగులూరు, బల్లికురవ, చిలకలూరిపేట, నాదెండ్ల, నకరికల్లు మండలాల్లో ప్రస్తుత మార్కెట్ విలువల్ని సున్నా నుంచి 40 శాతం వరకు పెంచి జిల్లా స్థాయిలో ఆమోదం పొందారు. పెంచిన మార్కెట్ విలువలపై అభ్యంతరాల స్వీకరణను పూర్తి చేశారు. అదే విధంగా ఇతర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. ఫిబ్రవరి 1 నుంచి పెంచిన మార్కెట్ విలువలు అమల్లోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలో క్రయ, విక్రయదారులతో గత నాలుగు రోజులుగా రిజిస్ట్రార్ కార్యాలయాలు కిక్కిరిశాయి. ప్రస్తుత మార్కెట్ విలువల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవటానికి ఆసక్తి కనబరిచారు.

తొలుత జనవరికి.. కాస్త వాయిదా

తొలుత రిజిస్ట్రేషన్ల చార్జీల పెంపును జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని నిశ్చయించుకున్న కూటమి సర్కారు.. ఈ ఆలోచనను కొంత వాయిదా వేసుకుంది. రాష్ట్ర ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, నూతన సంవత్సరం రోజున పెంపుపై సొంత పార్టీ నాయకుల నుంచే ఫిర్యాదులు అందడంతో కాస్త వాయిదా వేసే ఆలోచనలో పడింది. ఫిబ్రవరి 1వ తేదీ తర్వాత రిజిస్ట్రేషన్ల చార్జీల పెంపు ఉండనుందని సమాచారం.



నరసరావుపేట జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

త్వరలో రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు

జనవరి 1 నుంచి రిజిస్ట్రేషన్‌ల పెంపు ఉంటుందని ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే అనివార్య కారణాల వలన ప్రస్తుతం పెంపుదల ప్రక్రియ వాయిదా పడింది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్‌ల చార్జీల పెంపు అమల్లోకి రానుంది.

– రామ్ కుమార్, జిల్లా రిజిస్ట్రార్

ప్రకృతి సాగులో మెరిసినారిలా

సేద్య 'సాధికారత'

- పెదకూరపాడు ప్రాంతంలో 500 మంది మహిళా రైతుల సాగు
- సేంద్రియ ఉత్పత్తులతో లాభాల బాట

పెదకూరపాడు: వారందరూ మహిళా రైతులు.. రైతు సాధికారత సంస్థ సహాయంతో ప్రకృతి సాగు దిశగా ఒక్కో అడుగు ప్రారంభించారు.. ఆర్థిక ఇబ్బందులు లేకుండా సేంద్రియ ఉత్పత్తులతో లాభాల బాట పతున్నారు. కషాయాలు, ఘన, జీవామృతాలను వినియోగించి సేద్యం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పెదకూరపాడు మండల వ్యాప్తంగా 524 ఎకరాల్లో 500 మంది మహిళా రైతులు భర్తల సాయంతో ప్రకృతి వనరులే పెట్టుబడిగా ఆకు కూరలు, కూరగాయలు, ముల్లంగి, చిక్కుడు, క్యారెట్, కొత్తిమీర, పుదీనా, గోంగూర, దోస, పత్తి, మిర్చిలాంటి పంటలను సాగు చేస్తున్నారు. సహజంగా దొరికే పశువుల పేడ, గోమూత్రం, ఎరువులు, కషాయాలు, జీవామృతం, ఘనజీవామృతం పొలాల్లోనే తయారు చేసుకుని డ్రోన్లతో పిచికారీ చేయిస్తున్నారు.

రద్దీ ప్రాంతాల్లో విక్రయాలు

పండించిన పంట ఉత్పత్తులను నేరుగా విక్రయిస్తున్నారు. సమీప పట్టణాలకు తీసుకెళ్లి ప్రభుత్వ కార్యాలయాలు, రద్దీ ప్రాంతాలు, వ్యాపార సముదాయాల వద్ద అమ్మకాలు చేస్తున్నారు.



పెదకూరపాడులో ఆకు కూరలు, కూరగాయలు విక్రయిస్తున్న మహిళా రైతులు



ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న మిరప పంట

ఏదో పంటలో ఆదాయం వస్తోంది



రెండు ఎకరాల్లో దోస, చిక్కుడు, క్యారెట్, ఆకు కూరలు, ముల్లంగి, మిరప, పత్తి ఇలా అనేక రకాల పంటలను సాగు చేస్తున్నాం. వీటిలో ఏదో ఒక పంట ద్వారానైనా బాగా ఆదాయం వస్తోంది. ఆరోగ్యకరమైన కూరగాయలు తింటున్నాం. లాభదాయకంగా ఉంది.

–మట్టుపల్లి హృదయలక్ష్మి, పెదకూరపాడు

ఖర్చులు బాగా తగ్గాయి



ఎకరంలో ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నాం. ప్రకృతి సేద్యంతో ఖర్చులు బాగా తగ్గాయి. దిగుబడి కూడా ఎక్కువగా ఉంటుంది. కుటుంబ పోషణతోపాటు పది మందికి ఉపాధి కల్పిస్తున్నాం. మేమే స్వయంగా ఉత్పత్తులను విక్రయిస్తున్నాం.

– షేక్ మహిబూబ్, పెదకూరపాడు

20 సెంట్లలో సేద్యం



మాకు ఉన్న 20 సెంట్లలో దోస, క్యారెట్, ముల్లంగి, తోటకూర, గోంగూర, పుదీనా సాగు చేశాను. మంచి ఆదాయం వస్తోంది. కుటుంబ పోషణతోపాటు లాభాలు బాగానే ఉన్నాయి. ప్రస్తుత కాలంలో ప్రకృతి వ్యవసాయమే మేలు.

– నందిగామ జోత్స్న.పెదకూరపాడు

తోటి మహిళలను ప్రోత్సహిస్తున్నాం



రెండు ఎకరాల్లో పత్తి, మిర్చి, ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నా. రైతు సాధికారత సంస్థ సాయం అందిస్తోంది. ఆ సంస్థ ప్రతినిధుల సూచనల మేరకు మహిళా రైతులను ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేసేలా కృషి చేస్తున్నాం.

– సర్వేపల్లి అమూల్య, పెదకూరపాడు

స్టడీ మెటీరియల్ ఏదీ ?

- టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు 100 రోజుల ప్రణాళిక
- ఇప్పటి వరకు స్టడీ మెటీరీయల్ పంపిణీ చేయని ప్రభుత్వం
- పరీక్షలకు ఇంకా 42 రోజులే..
- సాధనకు విద్యార్థుల ఇబ్బందులు



సత్తెనపల్లి: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే ప్రణాళికను విద్యాశాఖ తయారు చేసింది. ఆ ప్రణాళిక ప్రకారం చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించిన స్టడీ మెటీరియల్‌ను అందజేయాల్సి ఉంది. అయితే ఇంతవరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. స్టడీ మెటీరియల్ ఇచ్చేందుకు తమ వద్ద నిధులు లేవంటూ విద్యార్థులపైనే భారం వేస్తున్నారు. ఏటా జిల్లా పరిషత్ నుంచి స్టడీ మెటీరియల్ ఇచ్చేవారు. ఈ ఏడాది ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేసింది. రాష్ట్ర విద్యాశాఖ తయారు చేసిన క్వశ్చన్ బ్యాంక్, మోడల్ ప్రశ్న పత్రాలతో కూడిన బుక్‌లెట్లను పీడీఎఫ్ ఫైల్ రూపంలో వచ్చిన వాటిని అలాగే స్కూళ్లకు పంపించారు. విద్యార్థుల్ని ప్రింట్ తీసుకొని చదువుకోవాలని సూచించారు. లాంగ్వేజెస్ బుక్ లెట్ 198, నాన్ లాంగ్వేజెస్ 218 పేజీలు ఉంది. ఈ రెండిటినీ ప్రింట్ తీసుకోవాలంటే ఒక్కో పేపర్‌కు కనీసం రూ. 2 చొప్పున తీసుకుంటారు. దీనివల్ల విద్యార్థులపై స్టడీ మెటీరియల్ భారం రూ.కోట్లలో పడుతోందని ఉపాధ్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

డివిజన్	పాఠశాలల సంఖ్య	టెన్త్ విద్యార్థులు
నరసరావుపేట	102	5,616
సత్తెనపల్లి	66	4,229
గురజాల	86	5,115
మొత్తం	254	14,960

గడిచిపోయిన 58 రోజులు..

మార్చి 17 నుంచి 31వరకు టెన్త్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులకు ఇంకా 42 రోజులు మాత్రమే మిగిలింది. మెరుగైన ఫలితాల సాధన దిశగా 100 రోజుల ప్రణాళిక సిద్ధం చేశారు. దీనిలో 58 రోజులు గడిచిపోయాయి. 100 రోజుల ప్రణాళిక కంటే ముందే విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేయాల్సి ఉన్నా ఇంతవరకు అందజేయలేదు.

క్లుప్తంగా

రేపు పింఛన్ల పంపిణీ

నరసరావుపేట: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా శనివారం జిల్లాలో 2,72,932 మంది పింఛనుదారులకు రూ.117.87 కోట్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్డీఏ పీడీ బి.బాలునాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలలుగా పింఛను నగదు తీసుకోని వారికి మొత్తం అందిస్తామని పేర్కొన్నారు. పింఛను ఇచ్చేందుకు సిబ్బంది ఇంటికి రాకున్నా, డబ్బులు డిమాండ్ చేసినా, ప్రవర్తన సరిగా లేకున్నా.. 91211 90656 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చని పీడీ తెలిపారు.

పకడ్బందీగా స్కూలు మ్యాపింగ్ ప్రక్రియ

విద్యాశాఖ అధికారులకు సూచించిన కలెక్టర్

నరసరావుపేట: స్కూల్ మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేయాలని, ప్రతి పంచాయతీలో కనీసం ఒక మోడల్ పాఠశాల ఉండేట్లుగా చూడాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లాలోని 28 మండలాల విద్యాశాఖ అధికారులతో పాఠశాలల పునఃవ్యవస్థీకరణ ప్రతిపాదనలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య 60 దగ్గర్లో ఉన్న వాటిని మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా ప్రతిపాదించాలని తెలిపారు. సుదూర ప్రాంతాల్లోని పాఠశాలలను పిల్లలకు ఇబ్బంది లేకుండా యథాతదంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. ఏ పాఠశాలలను మూసివేయడం జరగదని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉప విద్యాశాఖాధికారి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

మాచర్ల: పట్టణంలోని రూపే కాలనీలో ఇళ్ల తాళాలు పగులగొట్టి గ్యాస్ సిలిండర్లు, వస్తువులు చోరీ చేసిన నిందితుడు రామ్‌నాయక్‌ను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ప్రభాకరరావు, ఎస్సై సంధాని గురువారం తెలిపారు. కొద్దిరోజులుగా నిందితుడు పలు ప్రాంతాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లోకి చొరబడి వెండి వస్తువులు, గ్యాస్ సిలిండర్లు చోరీ చేస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి మాచర్ల అదనపు సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల వివరాలు అప్‌డేట్ చేసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న అన్ని కేడర్ల ఉపాధ్యాయులు శుక్రవారం సాయంత్రానికి పూర్తి వివరాలను టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టీఐఎస్) సైట్‌లో అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ సైట్‌లో వ్యక్తిగత లాగిన్ ద్వారా వివరాలను నమోదు చేయాలని సూచించారు. లాంగ్ లీవ్, వీహెచ్, సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయులు సైతం విధిగా నమోదు చేసుకోవాలన్నారు. ఒక్క ఉపాధ్యాయుడి పేరు నమోదు కాకున్నా అందుకు సంబంధిత డీడీవోలే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్ ఉపాధ్యాయుల పేర్లు ఏ కారణం చేతనైనా టీఐఎస్‌లో కనిపించని పక్షంలో సదరు ఉపాధ్యాయుల వివరాలతో పాటు ట్రెజరీ ఐడీని ఐటీ సెల్‌కు పంపాలని సూచించారు.

పదేపదే మోసం చేయడం చంద్రబాబు నైజం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ఎన్నికల ముందు హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి అలవాటేనని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇటీవల సూపర్ సిక్స్ హామీల అమలుపై సీఎం చేసిన ప్రకటనను ఆయన ఖండించారు. హామీలను మాజీ సీఎం వైఎస్ జగన్ వల్లే అమలుచేయలేకపోతున్నామని నిందలు వేయడం చంద్రబాబు దివాళా కోరు తనానికి నిదర్శమని మండిపడ్డారు. 2014 ఎన్నికల ముందు రూ.87 వేల కోట్ల పంట రుణాలు, డ్వాక్రా రుణ మాఫీ హామీని, 2024 ఎన్నికల హామీ సూపర్ సిక్స్‌ను గెలిచాక చంద్రబాబు విస్మరించిన తీరును గోపిరెడ్డి గుర్తుచేశారు. గతంలో ప్రతిపక్ష నేతగా రుణ మాఫీని అమలు చేయలేనని, అందుకు బడ్జెట్ సరిపోదని నిజాయితీగా వైఎస్ జగన్ చెప్పారన్నారు. సీఎంగా వైఎస్ జగన్ అమలుచేసిన సంక్షేమ పథకాలకు ఏడాదికి రూ.54 వేలు కోట్లు అవసరమైతే.. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలకు రూ.74 వేల కోట్లు, ఇతర పథకాలకు కలిపి రూ.1.21లక్షల కోట్లు అవసరమవుతాయని చెప్పారు. గత ఎన్నికల ముందు కూడా వైఎస్ జగన్ ఆ హామీలను తాను ఇవ్వలేనని, అందుకు బడ్జెట్ సరిపోదని తేటతెల్లంగా ప్రజలకు చెప్పారని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇప్పటికే రూ.3 లక్షల కోట్లు ఇచ్చామని చెబుతోందని, రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా రూ.1.10 లక్షల కోట్లు అప్పు చేసిందని చెప్పారు. మరి ఈ డబ్బంతా ఏం చేశారని, ఎక్కడికెళ్తోందని ఆయన నిలదీశారు. గత ప్రభుత్వంలో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేమని అంటున్నారని, మరి 2014–19లో టీడీపీ ప్రభుత్వం చేసిన రూ.1.92 లక్షల కోట్ల అప్పులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వడ్డీ కట్ట లేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో రొంపిచర్ల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, ఎస్టీ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, 8వ వార్డు ఇన్‌చార్జి షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

'కూటమి'కి గోపిరెడ్డి సూటి ప్రశ్నలు

- గత ప్రభుత్వంలో ధాన్యానికి రూ.2,200 మద్దతు లభిస్తే.. కూటమి ప్రభుత్వంలో రూ.1,500కు దిక్కు లేదు.
- 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలి.
- ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఇస్తామన్నారు. ఫిబ్రవరి వస్తోంది క్యాలెండర్ ఏమైంది.
- ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులను కళాశాలలు వెనక్కి పంపిస్తున్నా కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదు.
- 167–ఏ నేషనల్ హైవే కోసం నకరికల్లు–చీరాల ఓడరేవు వరకు.. ఎకరా భూమి విలువ రూ.3 కోట్లు ఉంటే.. నష్టపరిహారం రూ.50 లక్షలే ఇస్తామంటూ కూటమి ప్రభుత్వం బెదిరిస్తోంది.
- వచ్చే నెల 26న కోటప్ప కొండ తిరణాళ్లకు సంబంధించి ఇప్పటి వరకు అభివృద్ధి పనులు మొదలు కాలేదు. 20 లక్షల మంది భక్తులు వచ్చే తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం జరిగినా సరైన నిర్ణయాలు తీసుకోలేదు.

సంస్కృతిలో భాగం ఎడ్ల బల ప్రదర్శన

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి


ఎడ్ల బల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు జూలకంటి, యరపతినేని

రెంటచింతల: సంస్కృతి, సంప్రదాయాల్లో ఎడ్ల బల ప్రదర్శన ఒక భాగమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కానుక మాత చర్చి 175 ఏళ్ల తిరునాళ్ల సందర్భంగా గురువారం సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శనను ఆయన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. కానుకమాత సన్నిధిలో ప్రశాంత వాతావరణంలో ఎడ్ల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 21 ఏళ్ల తర్వాత రెంటచింతలలో కనుల పండువగా ఈ బల ప్రదర్శనను ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను, సహకరించిన వారిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు పోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ఫిబ్రవరి 7న సెయింట్ జోసఫ్ పాఠశాల వజ్రోత్సవాలకు పూర్వ విద్యార్థిగా తాను బ్రహ్మానందరెడ్డితో కలిసి మళ్లీ వస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులికూరి కాంతారావు, మాజీ వైస్ ఎంపీపీ సుమంత్‌రెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, కమిటీ సభ్యులు వైఎల్ మర్రెడ్డి, బి.రామకృష్ణ, ఒ.ఇన్నారెడ్డి, పి.రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంధుల అక్షర శిల్పి బ్రెయిలీ

జిల్లా జడ్జి పార్థసారథి

గుంటూరు రూరల్: అంధత్వం మనిషి శరీరానికే కానీ.. మానవ మేధస్సుకు ఏమాత్రం కాదని నిరూపించిన మహనీయుడు లూయి బ్రెయిలీ అని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైవీఎస్‌బీజీ పార్థసారథి కొనియాడారు. అంధుల అక్షర శిల్పిగా ఆయనను అభివర్ణించారు. జాతీయ అంధుల సమైక్య అమరావతి శాఖ ఆధ్వర్యంలో గురువారం గుంటూరు క్లబ్‌లో లూయి బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జరిగిన పలు పోటీల్లో పెద్ద సంఖ్యలో అంధులు పాల్గొనడం విశేషం. ఈ పోటీలను జిల్లా జడ్జి ప్రారంభించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా తాను అంధత్వాన్ని జయించడమే కాక యావత్ అంధులకు ప్రత్యేక లిపి ద్వారా సరికొత్త లోకాన్ని సృష్టించిన బ్రెయిలీ ఎందరికో ఆదర్శమని పేర్కొన్నారు. కష్టపడితే దరికి రానిది ఏదీ లేదన్న నమ్మకంతో ముందుకు సాగాలని కోరారు. సాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు ఏపీ బార్ కౌన్సిల్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, గుంటూరు క్లబ్ డైరెక్టర్ వి.బ్రహ్మారెడ్డి, కార్యదర్శి ఎస్.సాంబశివరావు, కోశాధికారి ఎం. భూపేష్ బహుమతులు అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో క్లబ్ ఎప్పుడూ చురుకైన పాత్ర పోషిస్తూనే ఉంటుందన్నారు. 4వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలావతి, ఎన్ఎఫ్‌బీఐ అమరావతి కార్యదర్శి పి. లక్ష్మీనారాయణ, కన్నా స్కూల్ కరస్పాండెంట్ కన్నబాబు, షిరిడీ సాయి దీన జన సేవా సమితి చైర్మన్ ఏ పూర్ణచంద్రరావు, ఎన్ఎఫ్‌బీఐ ఏపీ స్టేట్ అధ్యక్షుడు ఎస్.నాగార్జున, ప్రధాన కార్యదర్శి ఎం. రామసుబ్బయ్య, నేషనల్ సెక్రటరీ కె.నాగేశ్వరయ్య, ఏపీ జనరల్ సెక్రటరీ బి.విజయ రామారావు, ఎస్.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య




మాచర్ల రూరల్: మండల పరిధిలోని రాయవరం గ్రామ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల హాస్టల్ గదిలో 9వ తరగతి విద్యార్థి పంది రాజశేఖర్ (16) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. వెల్దుర్తి మండలం లోయపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ మధ్యాహ్నం పాఠశాల నుంచి హాస్టల్‌కు వెళ్లి భోజనం చేశాడు. తర్వాత గదిలో ఎవరూ లేని సమయం చూసి ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న యాజమాన్యం రాజశేఖర్‌ను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించింది. చికిత్స నిర్వహిస్తుండగా విద్యార్థి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రూరల్ ఎస్ఐ పి.రవి బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పారిపోయిన విద్యార్థులు క్షేమంగా ఇంటికి



దాచేపల్లి : చదువుకోమని తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి పారిపోయిన విద్యార్థులను 24 గంటల్లో పోలీసులు పట్టుకున్నారు. దాచేపల్లి ఎస్ఐలు సౌందర రాజన్, పాపారావు గురువారం వివరాలు వెల్లడించారు. మండలంలోని కేసానుపల్లి గ్రామానికి చెందిన మీసాల డేవిడ్, ఇర్లా శ్రీనివాసరావు, నగేష్ కృష్ణ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. బడికి వెళ్లకుండా తిరుగుతుండటంతో వీరిని తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఈ ముగ్గురూ బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి పారిపోయారు. నడికూడి రైల్వే స్టేషన్‌లో రేపల్లె ప్యాసింజర్ ఎక్కి రేపల్లెలో దిగి అక్కడ నుంచి సికింద్రాబాద్ చేరుకుని, జడ్చర్లకు వెళ్లారు. జడ్చర్లలో అనుమానాస్పదంగా తిరుగుతున్న విద్యార్థులను స్థానిక పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి సమాచారం సేకరించి, దాచేపల్లి పోలీసులకు తెలిపారు. పోలీసు సిబ్బంది జడ్చర్లకు చేరుకుని విద్యార్థులను తీసుకొచ్చి, స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తల్లిదండ్రులకు సూచించారు.

కన్న తండ్రిని కాల్వలోకి తోసి చంపిన కొడుకు



ఈపూరు(శావల్యాపురం): కన్న తండ్రినే కాల్వలోకి తోసి చంపాడు కొడుకు. ఈ ఘటన ఈపూరు మండలంలోని భద్రుపాలెం గ్రామం సమీపంలో సాగర్ కుడి కాల్వ వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నూజెండ్ల గ్రామానికి చెందిన గంగినేని కొండయ్య (80)కు ఇద్దరు కొడుకులు. మొదటి కుమారుడు వెంకటేశ్వర్లు నూజెండ్లలో ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నాడు. ఇటీవల కొండయ్య భార్య మృతి చెందింది. వెంకటేశ్వర్లు తండ్రిని చూసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో తండ్రి కొండయ్యను ఆరోగ్యం సరిగా లేదని చెప్పడంతో వైద్యశాలకు కారులో తీసుకెళ్లాడు. మార్గ మధ్యలో మూత్ర విసర్జన దిగిన కొండయ్యను భద్రుపాలెం సమీపంలోని సాగర్ కెనాల్‌లో వెంకటేశ్వర్లు తోసేసినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈపూరు ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికులు సాయంతో పోలీసులు కాల్వలోని మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యల్లమంద, చినతురకపాలెంలో కలెక్టర్ పర్యటన


గొనె సంచుల తయారీ కార్మికురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: మండలంలోని యల్లమంద, చినతురకపాలెం గ్రామాల్లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం పర్యటించారు. చినతురకపాలెంలోని గొనె సంచుల తయారీ యూనిట్లను సందర్శించారు. కార్మికుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గొనె సంచుల తయారీ మిషన్ల ఏర్పాటుకు గ్రూపులుగా ఏర్పడితే రూ.10లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. గ్రామంలోని ఉర్దూ పాఠశాలను సందర్శించిన కలెక్టర్‌కు 8వ తరగతి వరకే బోధన చేస్తున్నారని, 9, 10వ తరగతులు ప్రారంభించాలని గ్రామస్తులు విన్నవించారు. చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి సమాధానం ఇచ్చారు. యల్లమందలో గృహ నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలోని కల్యాణ మండపాన్ని నిధులు కేటాయించి పూర్తిచేయాలని గ్రామస్తులు కోరారు. కల్యాణ మండపాన్ని పరిశీలించిన కలెక్టర్ అంచనాలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మాధవిలత, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఎల్‌డీఎం రాంప్రసాద్, నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి తమ్మాజిరావు, తహసీల్దార్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

రీ-సర్వేలో పొరపాట్లకు తావుండకూడదు

జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే


తహసీల్దార్లతో సమీక్షిస్తున్న జేసీ సూరజ్ గనోరే

సత్తెనపల్లి: దీర్ఘకాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రీ-సర్వే తోడ్పడుతుందని, ఇందులో ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అన్నారు. సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో గురువారం సత్తెనపల్లి నియోజకవర్గంలోని తహసీల్దార్లు, డీటీలు, మండల సర్వేయర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రీ-సర్వేకు మండలానికి ఒక గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి, ముప్పాళ్ళ మండలం నార్నేపాడు, రాజుపాలెం మండలం గణపవరం, నకరికల్లు మండలం చాగల్లు గ్రామాల్లో పూర్తి స్థాయిలో రీ-సర్వే వేగవంతంగా జరగాలని ఆదేశించారు. అలాగే సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై సమీక్ష చేశారు. 22 (ఏ), సర్వే నంబర్ లేని భూములకు సంబంధించి మొత్తం ఒకేసారి ప్రతిపాదిస్తే వాటికి ప్రొవిజన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వాటిపై మండలాల వారీగా సమీక్ష చేశారు. ఆర్డీఓ జీవీ రమణాకాంత్‌రెడ్డి, ఆయా మండలా తహసీల్దార్లు పాల్గొన్నారు.

పులిచింతలలో 8 లక్షల చేప పిల్లల విడుదల


చేపపిల్లలు వదులుతున్న అధికారులు

అచ్చంపేట: పులిచింతల జలాశయంలో మత్స్య, వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు గురువారం 8 లక్షల చేప పిల్లలను వదిలారు. జిల్లా మత్స్యశాఖాధికారి ఎస్.సంజీవరావు మాట్లాడుతూ.. మత్స్యకారుల జీవనోపాధిని మెరుగు పరచేందుకు కలెక్టరు ఆదేశాల మేరకు ప్రాజెక్టులో 52 లక్షల చేప పిల్లలు వదిలేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తొలి విడత చేప పిల్లలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం సేవలను, పథకాలను సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు ఆర్థికంగా బలపడాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఐ.మురళి సూచించారు. అనంతరం మత్స్యశాఖ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అరుణకుమారి, కిషోర్, లలిత, పర్యవేక్షకులు జి.భాగ్యలత, తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్, ఎంపీడీఓ కోయ శ్రీనివాసరావు, ఏవో పి.వెంకటేశ్వర్లు, మత్స్యకారుల సహకార సంఘ అధ్యక్షుడు ఎస్.సురేష్ పాల్గొన్నారు.

ఫార్మసీ సిలబస్ డిజిటలీకరణ


సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

చేబ్రోలు: పెరుగుతున్న ఇండస్ట్రీ అవసరాలు, టెక్నాలజీలకు అనుగుణంగా ఫార్మసీ సిలబస్‌ను డిజిటలైజ్ చేయబోతున్నామని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ప్రెసిడెంట్ డాక్టర్ మోంటుకుమార్ ఎం.పటేల్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ''ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్- ఏ ఫ్యూచరిస్టిక్ అప్రోచ్'' అంశంపై మూడు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను '' నెక్స్ట్‌జెన్ ఫార్మా కనెక్ట్-2025'' అనే ఇతివృత్తంతో గురువారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా సావనీర్ విడుదల చేశారు. మోంటుకుమార్ ఎం.పటేల్ మాట్లాడుతూ.. పీసీఐ ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు సరికొత్త టెక్నాలజీపై ట్రైనింగ్, స్కిల్స్ పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ.. పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్ వలన జన్యుపరమైన విశ్లేషణ ద్వారా ఏ ఔషధం రోగికి అనుకూలమవుతుందో ముందుగానే అంచనా వేసి సరైన మందును అందించవచ్చని చెప్పారు. వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్, ఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఎం.విల్లియం కారే, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, ప్రిన్సిపల్ పి.శ్రీనివాస బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా కేంద్రం

- కార్యక్రమాల మెరుగుకు ప్రోత్సాహం
- ఉత్తమ పనితీరు చూపితే రూ.లక్ష నజరానా
- జిల్లాలో 70 పంచాయతీలకు ప్రతిపాదన


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి ఎత్తు కొలుస్తున్న కార్యకర్త

సత్తెనపల్లి: పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషణ్ అభియాన్‌ను ఇప్పటికే కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా సాక్ష్యం, పోషణ్ 2.0 కార్యక్రమాలు అమలు చేస్తోంది. వీటిని మరింత ప్రోత్సహిస్తూ ... ఉత్తమ ఫలితాలు సాధించిన పంచాయతీలకు 'సుపోషిత పంచాయతీ అభియాన్' పేరిట పురస్కారాలు ప్రకటించనుంది. ఎంపికైన పంచాయతీలకు రూ. లక్ష నజరానా అందజేయనుంది. ఇందుకు అంగన్‌వాడీ కేంద్రాల పనితీరే ప్రామాణికం కానుంది. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. తదనుగుణంగా జిల్లా అధికారులు 70 గ్రామ పంచాయతీలను ప్రతిపాదించారు.

పరిశీలన అంశాలివే...

ఇందులో పోషణ్ ట్రాకర్ యాప్ నిర్వహణ కీలకం కానుంది. లబ్ధిదారులను గుర్తించి యాప్‌లో పొందుపరచడం, కేంద్రాల నిర్వహణ, రోజువారీ పనితీరు, చిన్నారుల ఎదుగుదలను పరిశీలించనున్నారు. లబ్ధిదారుల యోగక్షేమాలు తెలుసుకోవడం, పోషకాహారం సరఫరా, పూర్వ ప్రాథమిక విద్య బోధన, అభ్యాసన, కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతులు, ఎత్తు, వయసుకు తగ్గ బరువు లేని పిల్లల (శామ్, మామ్,ఎస్‌యూడబ్ల్యూల)ను గుర్తించి లోపాల నివారణకు చర్యలు తీసుకోవడం తదితరాలను నిశితంగా పరిశీలిస్తారు. ప్రతిపాదిత పంచాయతీలు పురస్కారాలు సాధించేలా అంగన్‌వాడీ సిబ్బందికి ఐసీడీఎస్ జిల్లా అధికారులు మార్గ నిర్దేశం చేస్తున్నారు. ఎంపికైన పంచాయతీకి రూ. లక్ష ప్రోత్సాహక నగదు ఇస్తారు. అందులో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలకు 25 శాతం, గ్రామంలో చైతన్య, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు 25 శాతం, అంగన్‌వాడీలో పోషణ వాటికలు, సంబంధిత కార్యక్రమాలకు 50 శాతం వెచ్చించాల్సి ఉంటుంది.

ప్రతిపాదిత అంశాలు ఇవి..

ప్రాథమిక పరిశీలన: ఫిబ్రవరి 15
రాష్ట్ర కమిటీల క్షేత్ర తనిఖీ, బృంద పరిశీలన: ఫిబ్రవరి 15 – జూలై 31
మూడో విడత మూల్యాంకనం: ఆగస్టు, సెప్టెంబర్ నెలాఖరు
ఫలితాల వెల్లడి: సెప్టెంబరు, అక్టోబరు నెలాఖరు

నేడు మిర్చి యార్డు కార్యదర్శిగా చంద్రిక బాధ్యతల స్వీకరణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శిగా ఎ.చంద్రిక శుక్రవారం ఉదయం 9.30 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ప్రాజెక్టు అధికారిణిగా పనిచేస్తున్న చంద్రికను ఏడాది పాటు డిప్యుటేషన్ మీద కొనసాగేలా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా ఆమెను ఏడాది పాటు గుంటూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా డిప్యుటేషన్‌పై నియమించుకునేందుకు మున్సిపల్ పరిపాన శాఖ ఇప్పటికే అనుమతి ఇచ్చింది. మార్కెటింగ్, మున్సిపల్ శాఖల నుంచి ఆమెకు లైన్ క్లియర్ అవ్వడంతో శుక్రవారం ఆమె మిర్చి యార్డు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పనిచేసిన వినుకొండ ఆంజనేయులు రాజమహేంద్రవరం మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా వెళ్లనున్నారు.

వైద్యవిద్య సీటు పేరిట రూ.12 లక్షల మోసం

జేకే కన్సల్టెంట్ ఏజెంట్ రాజేష్‌పై కేసు నమోదు

తాడికొండ: జార్జియాలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ రూ.12 లక్షలు స్వాహా చేసిన ఘటనపై తాడికొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కె.వాసు తెలిపిన వివరాల ప్రకారం... దామరపల్లి గ్రామానికి చెందిన దాసరి యశోదలక్ష్మి తన కుమారుడు వెంకటేష్‌కు ఎంబీబీఎస్ సీటు కోసం గుంటూరుకు చెందిన జేకే కన్సల్టెంట్‌ను సంప్రదించారు. అందులో ఎడ్యుకేషన్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న తుమ్మలపూడి రాజేష్ జార్జియా దేశంలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి పలు దఫాలుగా రూ.12 లక్షల నగదు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకున్నాడు. సీటు ఇప్పించకపోగా.. నగదు, సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వకుండా బాధితులను బెదిరిస్తుండటంతో దాసరి యశోదలక్ష్మి తాడికొండ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తుమ్మలపూడి రాజేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 416 పోలింగ్ కేంద్రాలు

- కోడ్ అమలుకు పార్టీలు సహకరించాలి
- గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వినతి

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, డీఆర్ఓ షేక్ ఖాజావలి, ఆర్డీఓ కె. శ్రీనివాసరావులతో కలసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. బహుజన్ సమాజ్ పార్టీ తరఫున చిరతనగండ్ల వాసు, భారతీయ జనతా పార్టీ నుంచి చరక కుమార గౌడ్, సీపీఎం తరఫున వై.కృష్ణకాంత్, తెలుగుదేశం పార్టీ నుంచి కంచర్ల శివరామయ్య, జనసేన తరఫున గాదే వేంకటేశ్వరరావు , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అత్తోట జోసఫ్ , కాంగ్రెస్ పార్టీ నుంచి బిల్లా సునీల్, ఆప్ తరఫున టి. సేవా కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 29 నాటికి మొత్తం 3,46,614 మంది ఓటరుగా నమోదు అయ్యారని చెప్పారు. 416 పోలింగ్ స్టేషన్లు గుర్తించడం జరిగిందన్నారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు జనవరి 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేశు పాల్గొన్నారు.

సదరన్ ప్రైవేటు ఉపాధ్యాయ సంఘం రికార్డ్

గుంటూరు ఎడ్యుకేషన్: సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంస్థ (ఎస్పీఎల్‌టీవో) అంతర్జాతీయ వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పయర్ల నాగయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఈ నెల 19న గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా 151 మంది మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, విద్యాసంస్థల డైరెక్టర్లకు జాతీయ పురస్కారాలను ప్రదానం చేశామని తెలిపారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 800 మంది మహిళలు పాల్గొనడంతో అరుదైన కార్యక్రమంగా వండర్ బుక్ రికార్డ్స్‌లోకి ఎక్కినట్లు వివరించారు. ఈ మేరకు రికార్డ్ సంస్థ భారత ముఖ్య సమన్వయకర్త బింగి నరేంద్రగౌడ్ స్వయంగా ప్రపంచ రికార్డు ధ్రువపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.